విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

ఏయూ మైదానంలో మొక్కలు పెంచండి

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు విజ్ఞప్తి

విశాలాంధ్ర - విశాఖ: ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటన, బహిరంగ సభ నేపథ్యంలో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తొలగించిన వృక్షాల స్థానంలో మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కి వినతిపత్రం అందజేశారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 12వ తేదీన విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన బహిరంగసభ ఏర్పాట్ల కోసం మైదానంలోని భారీ వృక్షాలను తొలగించారని తెలిపారు. ఈ చర్యలు పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించాయని పేర్కొన్నారు. ఈ తరుణంలో విశ్వవిద్యాలయంలో తొలగించిన భారీ వృక్షాల స్థానంలో మొక్కల పెంపకం అత్యావశ్యకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె రెహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, పి.చంద్రశేఖర్, సిఎన్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంచగ్రామాల బాధితులకు న్యాయం జరిగేనా...?

విశాలాంధ్ర-గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానం భూములకు, పంచగ్రామాల భూ బాధితులకు న్యాయం జరుగుతుందా ? లేదా అంటూ పంచగ్రామాల ప్రజలు గుస గుస లాడుకుంటున్నారు. 2004 వరకు దేవ స్థానంకు ఎల్.ఆర్.సి అప్లికేషన్లు 6,110 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 2,514 మందికి ఎల్.ఆర్.సి మంజూరు అయ్యాయి. ఇంకా పూర్తిగా చెల్లించిన 794 ఎల్.ఆర్.సిలు పెండింగ్ ఉన్నాయి. అదేవిధంగా 2,802 అప్లికేషన్స్ కొద్ది మొత్తాన్ని చెల్లించారని విశ్వసనీయ సమాచారం. అయితే 2004 తరువాత ఎవరికీ నచ్చినట్లు వారు వారి వారి వివిధ ఉత్తర్వులతో నిర్మా ణాలు జరిగాయి. అయితే ఎల్.ఆర్..సి లను మార్చి నిర్మాణాలు చేస్తున్నారు. ఏంటిది అని అధికారులను అడిగితే వారికి ఎల్.ఆర్.సి ఉందని దశాబ్దాలుగా ఆ భూములను సాగు చేసుకుంటూ ప్రజలు జీవిస్తున్నారు. భూములకు శిస్తు కడుతున్నా వాటిపై హక్కు మాత్రం వారికి లేదు.. ఇల్లు రిపేరు చేయించుకోవాలన్నా అనుమతులు లేవాయే. ఆయా ప్రభుత్వాలు 100



గజాల్లోపు ఎవరిని ఇబ్బంది పెట్టవద్దని చెబితే, వీటిపై ఓ ఉన్నతాధికారి ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వద్దని కోర్ట్ నుండి ఉత్తర్వులు తీసుకొచ్చారని సమాచారం. ఎన్నికలు వచ్చినప్పుడల్లా భూ సమస్య పరిష్కరిస్తామని నాయకులు చెప్పే మాటలు నమ్మి ఓట్లు వేస్తున్న ఆ పేద ప్రజలకు చివరికి నిరాశే ఎదురవుతోంది. ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు హామీలు ఇస్తూనే ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతూనే ఉన్నాయి. పంచగ్రామల భూబాధితుల తలరాతలు మాత్రం మారడం లేదు. ఒకటా రెండా..ఇప్పటికి రెండున్నర దశాబ్దాలు గడుస్తోంది. సమస్య ప్రస్తావనకు వచ్చేటప్పుడల్లా న్యాయస్థానం పేరుచెప్పి పాడిన పాటే పాడుతున్నారు. న్యాయస్థానం ముందు వాదనలు వినిపించడంలో ప్రభుత్వ, దేవదాయ శాఖ ప్రతినిధులు విఫలమవుతున్నారు. దీంతో భూ సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరగడం లేదన్న అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది. పాత ఇళ్లకు మరమ్మతులు, శిథిలమవుతున్న వాటి స్థానాల్లో పునర్నిర్మాణాలకు అనుమతులివ్వాలని బాధితులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్న నాథుడులేడు. కానీ కొంతమంది వారి వారి పలుకుబడి ఉపయోగించి నిర్మాణాలు సాగిస్తున్నా దేవస్థానం అధికారులు వారికే వత్తాసు పలుకుతున్నారు. ఇటీవల కాలంలో దేవస్థానం భూపరిరక్షణ అధికారులు కొంతమంది చూసి చూడనట్లు అనుమతులు ఇచ్చినట్లు ఇస్తూ ఇదిగో అల్లా విలేకరి ఫోటోలను ఈఓకు పెట్టారని మధ్యతరగతి చిన్న చిన్న నిర్మాణాలను కూలగొడు తున్నారు. భూపరిరక్షణ విభాగం వలన అప్పన్న దేవస్థానంకు సుమారు రెండు కోట్ల రూపాయిలు నష్టం వాటిల్లుతుంది. పోనీ భూ ఆక్రమణలు, నిర్మాణాలు ఆగుతున్నాయా ? అంటే అదిలేదాయే అంటూ భూబాధితులు వాపోతున్నారు.

ఆరు నెలలు కృషి చేస్తే మార్పు వస్తుంది: కలెక్టర్

విశాలాంధ్ర - పాడేరు: అంగన్వాడి కేంద్రాల సిబ్బంది, సూపెర్వైజర్లు, సీడీపీఓలు, మహిళా పోలీసులు ఒక ఆరు నెలల పాటు గట్టిగా కృషి చేస్తే మార్పు వస్తుందని కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అరకు నియోజకవర్గం పరిధిలోని ఐసిడిఎస్ అధికారులు, మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సచివాలయాలలో మహిళా పోలీస్ పాత్ర చాలా ముఖ్యమైనదని, వారు డీలర్ల రేషన్ షాపులు, ఎం.ఎల్.ఎస్ పాయింట్లు సందర్శించాలని, అంగన్వాడి సూపెర్వైజర్లు, ఆయాలు, హెల్పర్లకు సహకరించాలని సూచించారు. ఆరు నెలల నుండి 36 నెలల పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాత, శిశు మరణాల నివారణలో మహిళా పోలీస్ పాత్ర కీలకమన్నారు. సచివాలయ సందర్శనలో మహిళా పోలీసులు గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సేవలపై రికార్డులు తనిఖీ చేస్తానని ప్రతి ఒక్కరు అందుకు సంబంధించిన రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. పరిశీలనలో లోపాలు కనబడితే సంబంధిత వ్యక్తులకు షోకాజ్ నోటీసు బదులు వారి వారి సర్వీస్ రిజిస్టర్లలో రెడ్ మార్క్ ఎంట్రీ నమోదు చేస్తానని హెచ్చరించారు. ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఐసిడిఎస్ పథక సంచాలకులు సూర్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మ కొండపైకి రహదారి నిర్మాణానికి కృషి

మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర - పాయకరావుపేట: అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట మండలంలోని గోపాలపట్నంలో ఉన్న సీతమ్మ కొండ పైకి వెళ్లేందుకు రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి, మౌలిక వసతులు, వాణిజ్య శాఖ మంత్రి అమర్నాథ్ అన్నారు. సోమవారం కొండపై ఉన్న శ్రీ ఉమా ధర్మ లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భం గా ఆయన సొంత నిధులతో కొండపైన భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి దివం గత గుడివాడ గురునాధరావు ఎమ్మెల్యేగా గెలుపొంది స్వామివారి దర్శించుకున్న తర్వాత మంత్రి పదవి దక్కిందని తెలిపారు. కొండపైకి తన తండ్రి విద్యుత్ సౌకర్యం కల్పించారని తెలిపారు. కొండపైకి వెళ్లేం దుకు రహదారి సరిగ్గా లేని కారణంగా, రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి గుడివాడ అమ ర్నాథ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వైసీపీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, సర్పంచ్ వస్నీరు పాపారావు, ఎంపీటీసీ కలిదిండి సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 17న గీతం పూర్వవిద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2001 సంవత్సరం నుంచి 2007 సంవత్సర కాలంలో వివిధ కోర్సులు అభ్యసించి దేశ, విదేశాలలో ఉన్నత స్థానాలలో నిలిచిన పూర్వవిద్యార్థులకు డిసెంబర్ 17వ తేదీన "హోమ్ కమింగ్- 2022" పేరిట అంతర్జాతీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ తెలిపారు. "గీతం హోమ్ కమింగ్-2022" సమ్మేళనంలో పాల్గొన దలచిన పూర్వ విద్యార్థులు గీతం వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చునన్నారు. పూర్తి సమాచారం కోసం 7842530045ను సంప్రదించాల్సిందిగా సూచించారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా అంకంరెడ్డి పార్వతి బాధ్యతలు

విశాలాంధ్ర - నాతవరం: మండల కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా అంకం రెడ్డి పార్వతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. దివంగత నేత వైసీపీ నాయకులు అంకంరెడ్డి జమీలు అకాల మరణంతో అధ్యక్ష పదవి ఖాళీ అవ్వడంతో ఆ స్థానంలో జమీల్ సతీమణి అయిన అంకంరెడ్డి పార్వతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పదవీ బాధ్యతలు చేపట్టిన పార్వతి విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో రుణాలు అంద జేయడం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు పైల పోతురాజు, వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు శెట్టి నూకరాజు, గ్రామ ఉపసర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు కరక రేణుక, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాన్ని అందించే కేంద్రాలు గ్రంథాలయాలు

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జ్ఞానాన్ని అందించే కేంద్రా లుగా గ్రంథాలయాలు నిలుస్తా యని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. ఏయూ డాక్టర్ వి.ఎస్.కృష్ణా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్స వాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాళ పత్రాలలో ఉన్న జ్ఞాన సంపదను పరిరక్షించే ప్రాజెక్టును విజయ వంతంగా పూర్తిచేయడం హర్షణీయమన్నారు. అదే విధంగా పీహెచ్‌డి థీసిస్‌లు డిజిటలైజేషన్ చేసి శోధ్‌గంగ వెబ్‌సైట్‌లో ఉంచడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో దీనిలో ఏయూకు 9వ ర్యాంక్ లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్స్ ఆచార్య వి.విజయ లక్ష్మి, ఎస్.కె భట్టి, టి.శోభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో నెహ్రూ జయంతి

విశాలాంధ్ర - కూర్మన్న పాలెం: ఉక్కునగరంలో గల నెహ్రూ పార్కులో జవహర్ లాల్ నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ విగ్రహా నికి పూలమాలతో స్టీల్ యూనియన్‌లో నాయకులు, పోరాట కమిటీ సభ్యులు, సీపీఐ నాయకులు, యాజమాన్య ప్రతినిధులు ఘనంగా అర్పించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె. స్టాలిన్, ఉక్కు పోరాట కమిటీ నాయకులు కె.ఎస్.ఎన్ రావు, డి.ఆది నారాయణ, జె.అయోధ్యరామ్, గంధం వెంకట్రావు, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, కె.రాజబాబు, విల్లా రామ్మోహన్ కుమార్, నీరుకొండ రామచంద్రరావు, గుమ్మడి నరేంద్ర, బి.డేవిడ్, జి.ఆనంద్, జె.మోహన్ కుమార్, కోరాడ వెంకట్రావు, సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్య నారాయణ, త్రిఫ్ట్ డైరెక్టర్ కర్రీ శ్రీనివాస్, ఉక్కు అధికారులు మంత్రి నర్సింహ మూర్తి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

మంచి పుస్తకం మనిషి జీవితంలో మార్పు తెస్తుంది

మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మంచి పుస్త కాలు మనిషి జీవితంలో గొప్ప మార్పును తీసుకువస్తాయని రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడులు ప్రాథమిక వసతులు, వాణిజ్యం, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. ప్రతీఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకో వాలని కోరారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాలను పురస్కరించుకొని స్థానిక విఎమ్‌ఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జునతో కలిసి ఆయన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు సమాజం పట్ల అవగాహన అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ కొండా రమాదేవి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, డీఈఓ చంద్రకళ విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్గీయ పీవీజీ రాజుకు ఘన నివాళులు

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం అనువంశిక ధర్మకర్త స్వర్గీయ గౌరవ పీవీజీ రాజు 27వ వర్ధంతి సందర్భంగా దేవస్థానం అధికారులు శ్రీ స్వామివారి కృష్ణాపురం గోశాలలో ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు పీవీజీ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఆయన సింహాచలం దేవస్థానంతో సహా ఇంచుమించుగా 100 దేవాలయాలకు వంశపారంపరిక ధర్మకర్తలు. వీరు కోరుకొండ సైనిక్ స్కూల్ స్థాపన కోసం 1961-62లో కేంద్ర ప్రభుత్వానికి కోరుకొండ ప్యాలెస్‌తో సహా సుమారు వెయ్యి ఎకరాల స్థలం దానం చేశారు. దీని మూలంగా మొత్తం దేశంలోని 20 సైనిక్ పాఠశాలలో మొదటిదైన కొరుకొండ సైనిక పాఠశాల ఇక్కడ ప్రారంభించబడింది. ఈయన సేవలు అమోఘమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.రాంబాబు, సహాయ కార్య నిర్వహణ అధికారి ఎన్.ఆనంద్ కుమార్, వై.శ్రీనివాసరావు, యూనియన్ ప్రెసిడెంట్ హరి సునీల్ కుమార్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నిబంధనలు అధికార పక్షానికి వర్తించవా..?

గాజువాక జీవీఎంసీ పరిధిలో వైసీపీ కటౌట్లు, బ్యానర్లు

విశాలాంధ్ర - గాజువాక సిటీ: గత నెల అక్టోబర్‌లో గాజువాక ఎమ్మెల్యే కుమారుని పుట్టినరోజు నేపథ్యంలో కొత్త గాజువాక మార్కెట్, పాత గాజువాక ప్రధాన కూడలి, చైతన్య నగర్‌లో వీరి అనుచరులు ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు జీవీఎంసీ సిబ్బంది ఇప్పటికి తొలగించకపోవడం ఎంతవరకు సమంజ సమని పలువురు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అసలే అధ్వా న్నంగా ఉన్న రోడ్లతో సతమతమౌతున్న గాజువాక ప్రజలు కేవలం ఈ భారీ కటౌట్లు కోసం కర్రలు పాతడానికి కొత్తగాజువాక మార్కెట్ రోడ్లపై గుంతలు తవ్వేశారు. ఇతరులు, సామాన్యులు చిన్న చిన్న బ్యానర్లు కడితే నో హోర్డింగ్ పాలసీ, నో ఫ్లెక్సీ పాలసీ అంటూ వెంటనే స్పందించి వాటిని తొలగించే అధికా రులు పాత గాజువాక జంక్షన్‌లో ఏకంగా హైమాస్ట్ లైట్ల ఫోల్‌కు కట్టేసిన ఇంత భారీ కటౌట్లు కనబడకపోవడం విడ్డూరం.

సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలం పెదలువ్వాసింగి పంచా యతీలో రూ.45 లక్షలతో నిర్మించ నున్న సచివాలయ భవనానికి స్లాబ్ నిర్మాణం సోమవారం జరిగింది. పనులను ఎంపీటీసీ పరిశీలించి నాణ్యతగా చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లువ్వాసింగి గౌరవ సూపర్ సర్పంచ్, వైసీపీ సీనియర్ నాయకుడు కొండపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొర, ఉప సర్పంచ్ గబ్బాడి గణపతి, మాజీ సర్పంచ్ గబ్బాడి పండు దొర, వైసీపీ నాయకులు బెధర బంగారు రాజు, ఉలంగి కర్రీవడాల్, సుకూరు నీలకంఠం, వలంటీర్ బోరుబోజి మత్యకొండబాబు, గబ్బాడి కొండబాబు, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ మత్స్యరాస ఉమారాణి, కోరాబు వెంకటేష్ పడాల్ తదితారులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

విశాలాంధ్ర-యలమంచిలి: యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాసంవత్సరం మధ్యలో అధ్యాపకుల బదిలీ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని అలాగే కళాశాలలో జ్ఞానభూమి పేరిట డబ్బులను వసూలు చేస్తున్న అధ్యాపకులను తక్షణమే సస్పెండ్ చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేసి స్థానిక జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రమణ మాట్లాడుతూ విద్యాసంస్థల మధ్యలో అధ్యాపకులు బదిలీ అనేది సరైనది కాదని దీనివలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని ఆయన అన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్నటువంటి అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప కార్యదర్శి బి.బాబ్జి, యలమంచిలి డివిజన్ కార్యదర్శి డివిజన్ నాయకులు బాలాజీ, కావ్య, మహాలక్ష్మి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - జీకేవీధి: జికేవీధి మండలం రింతాడ పంచాయతీ కడుగుల ఎంపిపి పాఠశాలలో నాడు నేడు పనులను సోమవారం ఎస్టీ కమిషన్ సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జెడ్పీటీసీ కిముదు శివరత్నం, ఎంపీపీ బోయిన కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్.జగన్ విద్యకు, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, ఎంపిటిసి ప్రకాశిని, మండల నాయకులు పాల్గొన్నారు.

వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సహస్ర కుంబాభిషేకం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల కేంద్రం యస్.రాయవరం గ్రామం వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సహస్ర కుంబాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయం ఏడవ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు హరి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిత్యార్చన, అభిషేకం, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం రాత్రి వైభవ వేంకటేశ్వరస్వామి వారి దివ్య లీలా కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదా కుమారి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి పైలా విరాళం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం పోతనపూడి అగ్రహారం, పెంటయ్యపాలెం గ్రామాల్లో రెండు ఆలయాల అభివృద్ధి కోసం మాడుగుల నియోజకవర్గ టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు రూ. 40 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. గ్రామ పెద్దలు, యువత ఆహ్వానం మేరకు రెండు గ్రామాలను సందర్శించిన పైలా వారి విన్నపం మేరకు పోతన పూడి అగ్రహారంలో పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి 25 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. అదే విధంగా పెంటయ్య పాలెంలో శ్రీ కృష్ణ ఆలయ నిర్మాణానికి 15 వేల రూపాయలను విరా ళంగా గ్రామ పెద్దలకు అంద జేశారు. ఆధ్యాత్మిక, క్రీడా, విద్యా కార్యక్రమాలకు నిత్య సహకారం అందిస్తూ, తమకు తోడ్పడుతున్నారంటూ పైలా సేవలను ఆయా గ్రామ పెద్దలు, యువత, మహిళలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ అధ్యక్షుడు కోరుకొండ సాంబమూర్తి, మైచెర్ల నానాజీ, కోరుకొండ రామునాయిడు, వేపాడ రాము, బోడా అప్పారావు, దండెల్ల శంకరరావు, పడాల నారాయణ మూర్తి, రాజు, శ్రీను పాల్గొన్నారు.

శ్రీరంగనాథ స్వామి ఆలయంలో భారీ అన్నసంతర్పణ



విశాలాంధ్ర - ఆనందపురం: కార్తీకమాసం మూడో సోమ వారం పురస్కరించుకొని గుడిలోవలో ఉన్న శివాలయా లంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గుడిలోవ గ్రామంలో గల రంగనాథ స్వామిగుడిలో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, భీమిలి వ్యవసాయ కమిటీ డైరెక్టర్ రౌతు శ్రీను, రంగనాథ స్వామి గుడి చైర్మన్ కోరాడ గిరిరాజు, మాజీ చైర్మన్ బంక కృష్ణం నాయుడు, షినగం పెద్ద రామారావు, షినగం చిన్న రామారావు, రేగాని శంకర్, పట్నాల బంగారునాయుడు, బంక మహేష్, ఎం.రాంజీ, గంధవరపు కుమార్, చందక శంకర్, ఎన్.సోము నాయుడు, మీసాల నర్సింగరావు, బుత్తల మధు, షినగం సురేష్, పొల్లూరి రాజు, కొట్ర మల్లికార్జునరావు, లోడగల వెంకట్రావు, కోరాడ రమణ, చందక వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డు అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర - మల్కాపురం: హిందూస్తాన్ షిప్ యార్డ్‌లో ఇటీవల జరిగిన ఎస్ సి /ఎస్ టి ఎంప్లాయిస్ అసోసి యేషన్ ఎన్నికలలో ఘన విజయం సాధించిన అసోసియేషన్ సభ్యులంతా సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రి, ఇతర డైరెక్టర్స్‌ను వారి ఛాంబర్‌లో సోమ వారం మధ్యాహ్నం మర్యాద పూర్వకంగా కలిసారు. షిప్ యార్డ్ అభివృద్ధికి సంఘ సభ్యు లంతా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.అనిల్ కుమార్, ప్రెసి డెంట్ కె.అప్పలకొండ, గౌరవ అధ్యక్షులు వై.శ్రీనివాసరావు, అడిషనల్ సెక్రటరీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - పరవాడ: కార్తీక మాసం మూడో వారం సందర్భంగా పరవాడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు తెల్లవారు జాము నుంచే బారులు తీరారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై స్పందించిన రెవెన్యూ సిబ్బంది

భూ ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

విశాలాంధ్ర- పెందుర్తి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కలెక్టరేట్ స్పందనలో అందిన ఫిర్యాదుపై పెందుర్తి రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన స్పందించారు. వేపగుంట రెవిన్యూ విలేజ్ సర్వేనెంబర్ 90, నాయుడు తోట మెయిన్ రోడ్డుకు ఆనుకుని ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఓ సీనియర్ సిటిజన్ స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసారు. దీనిపై దర్యాప్తు చేసి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలంటూ కోరారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పెందుర్తి తహసిల్దార్ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది కబ్జాకు గురైన రెవెన్యూ స్థలాన్ని పరిశీలించి, విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. రెవెన్యూ సిబ్బంది అక్కడ సర్వే నిర్వహించి భూ దురాక్రమణ వాస్తవమేనని నిర్ధారించి హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూ ఆక్రమణదారులు ఎంతటి వారైనా చర్యలు తప్పమన్నారు.

నిలిచిన బీఎస్ఎన్ఎల్ సేవలు

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలోని వాలాసి పంచాయతీకి బీఎస్ఎన్ఎల్ సేవలు పూర్తిగా నిలిచి పోయాయి. డముకు నుండి వాలాసి పంచాయతీ వరకు బీఎస్ఎన్ఎల్ ఫైబర్ లైను ఉంది. ముఖ్యంగా ఈ లైన్ ద్వారా సచివాలయాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. అయితే మరల అదే సచివాలయాలకు హై స్పీడ్ ఇంటర్నెట్ పునరుద్ధరించేందుకు బీఎస్ఎన్ఎల్ సిబ్బంది చర్యలు చేపడుతుండగా ఇటీవల ఎయిర్టెల్ నెట్వర్క్ గుత్తేదారులు బిఎస్ఎన్ఎల్ ఫైబర్‌ను ధ్వంసం చేయడంతో సచివాలయాల్లో ఆన్లైన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ విషయమై బీఎస్ఎన్ఎల్ ఎస్డీఈ రాజ్ కుమార్‌ను వివరణ కోరగా ప్రస్తుతం ఈ సమస్య తమ దృష్టికి వచ్చిందని సంబంధిత ఎయిర్టెల్ అధికారులతో మాట్లాడుతున్నామని అన్నారు.

ఆలయ అభివృద్ధికి పీవీజీ విరాళం

విశాలాంధ్ర - దేవరాపల్లి: మండలంలోని బోయల కింతాడ గ్రామంలో వన భోజనాలు కార్యక్రమంలో టీడీడీ మాడుగుల నియెజకవర్గం ఇన్చార్జి పివిజి కుమార్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి గాను తనవంతుగా 10,000 రూపాయలు విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఈశ్వరరావు, కాసుల బాబు, కొమార బాబురావు, కడిమి నాగేశ్వరరావు, గంజి ఈశ్వరరావు, తాతబాబు, అనకాపల్లి పార్లమెంటు సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

కురపల్లి శివాలయంలో భారీ అన్న సంతర్పణ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండురంగ పంచాయతీ కురపెల్లి గ్రామంలో శ్రీ చంద్ర శేఖర రామలింగేశ్వర ఆలయంలో కార్తీకమాసం మూడో వారం సందర్భంగా భారీ ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కె.రాంబాబు అన్నదానాన్ని ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి కోసం శివాలయం ముందు మండపం, సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఎంపీపీ నిధుల నుంచి 3 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ అమజూరి అప్పారావు, పల్లి మహేష్, మరగడం భూలోక రెడ్డి, మరగడ రమణారెడ్డి, పాలూరి కృష్ణ, నీలంశెట్టి చిన్నయ్య, రీసు సంతు, ఎన్.వెంకటేష్, రిస్ గౌరీనాథ్, బోరా సన్యాసి, మరగడ సత్యం, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం రోజున విద్యార్థులతో పనులు

ఫోటోలు తీయడానికి ప్రయత్నించిన పాత్రికేయులకు లోపల అనుమతి లేదంటూ నిరాకరణ

విశాలాంధ్ర - హుకుంపేట: ఆడి, పాడి ఆడుకునే వయసులో విద్యార్థుల చేత ఎటువంటి పనులు చేయించ కూడదన్న ప్రభుత్వ నిబంధనలు ప్రభుత్వం రాజ్యాంగంలో కల్పించింది. అయితే స్వయంగా బాలల దినోత్సవం రోజునే స్థానిక మండలంలోని మజ్జివలస ఆశ్రమ బాలుర పాఠశాలలో తరగతులు నిర్వహిం చకుండా విద్యార్థులతో ఉపాధ్యాయులు పనులు చేయించిన సంఘటన చోటు చేసుకుంది. అదికూడా మజ్జివలస పంచాయతీలో ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ గడప గడపకు కార్యక్రమం చేపట్టిన రోజే జరిగింది. ఆ కార్యక్రమానికి వెళ్లిన స్థానిక పాత్రికేయులు ఆ పాఠశాలను సంద ర్శించగా ఆ సమ యంలో పాఠ శాల లోపల విద్యార్థులు పనులు చేస్తూ కనబడ్డారు. దీనిపై పాత్రికే యులు లోపలికి వెళ్లి ఫోటోలు తీసేందుకు ప్రయత్నిం చగా ప్రధా నోపాధ్యాయుడు టి.నాగేశ్వరరావు బయట వ్యక్తులకు, పాత్రికేయులకు లోపల ప్రవేశా నికి అనుమతి లేదంటూ నిరాక రించారు. ఈ పాఠశాలలోనే కాకుండా జి.బుద్ధపుట్టు ఆశ్రమ బాలికల పాఠశాలలో కూడా అనుమతి లేదంటూ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరాకరించారు. సోమవారం తరగతులు నిర్వహించకుండా ప్రధానోపాధ్యాయుడు వారితో పనులు చేయించారు. ఐటీడీఏ పీఓ పాత్రికేయు లకు అనుమతి ఇవ్వకపోతే ఆశ్రమ పాఠశాలలో అవినీతి మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్ధేశిత సమయంలో సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను త్వరిత గతిన పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోను రీ ఓపెన్ కాకూడదని జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారం వలు విషయాలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుండి స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. వచ్చిన అర్జీలను కాలపరిమితిలోగ పరిష్కరించిన తరువాత దాని యొక్క ఫోటోను స్పందన పోర్టల్ లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఓటు నమోదు కొరకు దరఖాస్తులను త్వరతగతిన పరిశీలన చేయాలని తహశీల్దార్లు, ఎంపీడీవో లు, జోనల్ కమీషనర్లు ఏఈఆర్వోలను ఆదేశించారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా ఈ నెల 15 నుండి డిసెంబర్ 5 వరకు కుష్టు వ్యాధిపై శిక్షణ, అవగాహన ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హుకుంపేట: గిరిజన గ్రామల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, ఇచ్చిన మాట ప్రకారం గ్రామల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడపగడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని బూర్జ, తుంబవలస, జాంకరంవలస గ్రామాల్లో పర్యటించారు. గ్రామల్లో రోడ్డు సౌకర్యం లేనప్పటికి కాలినడకన నడుస్తు 230 గడపలకు వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అనంతరం భూర్జ గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామి ప్రకారం ఒంటిపాక గ్రామం నుంచి బూర్జ వరకు రూ.14 కోట్లతో తారు రోడ్డు నిర్మించామని అన్నారు. తుంబవలస, జాంకరంవలస గ్రామల్లో 2కిలో మీటర్లు మేరా రహదారి లేక ఇబ్బందులు పడున్నామని విన్న వించగా త్వరలోనే రోడ్డు మంజురు చేసి మళ్లి తమ గ్రామంలో అడుగు పెడతానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కూడా రాజుబాబు, వైస్ఎంపిపి ఒంటుబు ప్రియంక, మండల అధ్యక్షులు కొందబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, మార్కేట్ యార్డ్ వైస్ చైర్మెన్ సివేరీ కొండలరావు, సొసైటీ బ్యాంకు చైర్మెన్ కృష్ణారావు, జిల్లా యువజన విభాగం కార్యదర్శి నైని సత్తిబాబు, హుకుంపేట సర్పంచ్ వెంకట పూర్ణిమ, బూర్జ ఎంపిటిసి మజ్జి హరి పాల్గొన్నారు.

30శాతం రాయితీపై విత్తనాలు సిద్ధం

విశాలాంధ్ర-యలమంచిలి రూరల్: యలమంచిలి సబ్ డివిజన్ పరిధిలో ఉన్న రైతులు మినుము, పెసర, విత్తనాలు కావాలంటే ముందుగా తమ గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి నమోదు చేయించుకోవాలని యలమంచిలి ఇన్ ఛార్జ్ ఏడిఏ ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలను 30% రాయితీపై సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని స్థానిక గ్రంథాలయ అధికారిని కే సౌమ్య కోరారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయం వద్ద సోమవారం మండల ఎడ్యుకేషన్ అధికారితో కలిసి గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పందన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం: స్పందనలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని నర్సీపట్నం ఆర్డీవో బిహెచ్. భవానీ శంకర్ పేర్కొన్నారు. సోమవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై వినతులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలతో సామరస్యంగా మాట్లాడి వారి సమస్యను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు.

విశ్వేశ్వర అన్నపూర్ణేశ్వరి దేవాలయంలో అన్నసమారాధన

విశాలాంధ్ర - నాతవరం: తాండవ నది ఉత్తర వాహిని చమ్మచంత వద్ద కొలువుదీరిన విశ్వేశ్వర అన్నపూర్ణేశ్వరి దేవాలయం వద్ద సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నసమారాధన కార్యక్రమంలో నాతవరం, చమ్మచిత, మాధవనగరం, తాండవ, వల్సంపేట, గుమ్మడుగొండ, వెదురుపల్లి, కొయ్యూరు మండల ఆడాకుల, ఆర్.కొత్తూరు, కిష్టారం తదితర గ్రామాల ప్రజలు హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - అనంతగిరి: సమిద, ప్రామిస్డ్ ల్యాండ్ ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్, దిశ స్వచ్ఛంద సంస్థల అధ్యర్యంలో సోమవారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షులు శెట్టి నీలవేణి, జడ్పీటీసీ దీసరి గంగరాజు, సర్పంచ్ సోమేల రూతు శిబిరాన్ని ప్రారంభించారు. 260 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కరక రాము, సమిద కార్యదర్శి దొడ్డి వీరభద్రరావు, సంస్థ కోఆర్డినేటర్ దీసరి బుద్ధ రాజు, సంస్థ అధ్యక్షులు పడాల రమణ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - అనంతగిరి: కోండిభా పంచాయతీ సిసముండ గ్రామంలో 25 లక్షలతో నాడు నేడు పనులుకు ఎంపీపీ నీలవేణి, జడ్పీటీసీ, సర్పంచ్ పున్నమ్మ శంకుస్థాపన చేశారు. ఎంపీపీ శెట్టి నీలవేణి ఈ సందర్భంగా మాట్లా డుతూ పనులు వేగవంతం చేసి భవనం అప్పజెప్పాలన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయుడు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో శివాలయాలు కిటకిట

విశాలాంధ్ర - యలమంచిలి /యలమంచిలి రూరల్: శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసం మూడో సోమవారం కావడంతో పట్టణంలో, మండలంలో శివాల యాలకు భక్తులు పోటెత్తారు. పట్టణంలో కొత్తపేట,ప్రధాన రహదారి వద్ద గల త్రిమూర్తులు స్వామి ఆలయాలలో అలాగే మండలంలో పద్మనాభరాజు పేట, బయ్యవరం జంట గ్రామాలలో ఉన్న శివరామాలయంలో ఆలయ అర్చకులచే మంత్రోచ్చారణల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

దొండపూడిలో వివాహితపై అత్యాచారం

విశాలాంధ్ర - రావికమతం: మండలంలోని దొండపూడి గ్రామంలో వివాహితపై జరిగిన అత్యాచారం ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. కొత్తకోట పోలీసులకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్లు, ఇద్దరు మేజర్లు కలిసి వివాహితను అత్యాచారం చేశారని పోలీసులు తెలిపారు. దొండపూడి ఎస్సీ కాలనీలో భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్న 38 ఏళ్ల వివాహితను అదే కాలనీకి చెందిన నలుగురు యువకులు అత్యాచారం చేశారని పేర్కొన్నారు. దొండపూడి సమీపంలో గల కిత్తంపేటలో గల జీడి, మామిడి తోటలో కట్టెలు కోసం వెళ్లగా అదే సమయంలో ఆ ప్రదేశంలో సంచరిస్తున్న నలుగురు యువకులు ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారని తెలిపారు. దీంతో ఆమె భర్తతో కలిసి ఆదివారం రాత్రి కొత్త కోట పోలీసు స్టేషన్‌కు వచ్చి పిర్యాదు చేసినట్లు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఆదివారం రాత్రి డిఎస్పీ సునీల్ కుమార్ అర్ధరాత్రి సమయంలో కొత్తకోట పోలీసు స్టేషన్‌ను సందర్శించి విచారణ జరిపారు. సోమవారం ఉదయం అనకాపల్లి దిశా డిఎస్పీ మహేశ్వరరావు, సిఐ లక్ష్మీ, ఎస్ఐలు విభీషణరావు, శేఖరంలు దొండపూడి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించి యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

జీవీఎంసీ ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ కమిషన్ రాజబాబును సోమవారం జీవీఎంసీ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.ఆనందరావు ఆధ్వర్యంలో ఉద్యోగ కార్మికుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఏయూలో విజయవంతంగా పీఎం, సీఎం బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించినందుకు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలు ఉద్యోగ సమస్యలపై చర్చించారు. వార్డ్ సచివాలయాల్లో ప్రొఫెషన్ పిరియడ్ పూర్తి అయినవారిని రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులకు చనిపోయిన' 60 సంవత్సరములు పూర్తయిన వారి యొక్క వారసులకు ఉపాధి కల్పించుట కొరకు కమిటీ ద్వారా తదుపరి చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పి. ఆనంద్, బి. ఎర్రజి జీ. కుమార్, పి. దేవుడు, ఆర్. సత్యం, ఈ. రామకృష్ణ, సచివాలయ సంఘ నాయకులు గణేష్, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ప్రజలకు ఎమ్మెల్సీ మాధవ్ కృతజ్ఞతలు

విశాలాంధ్ర - గాజువాక : ప్రధాని నరేంద్రమోడీ విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేసిన ఉత్తరాంధ్ర ప్రజలకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాసనమండలి బీజేపీ పక్ష నేత, ఎమ్మెల్సీ పివియన్ మాధవ్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన శోభాయాత్రను కూడా జయప్రదం చేసిన బీజేపీ కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు అధ్వర్యంలో రాష్ట్ర బీజేపీ కోర్ కమిటి సభ్యులతో ప్రధాని మోదీతో కలసి సుమారు గంటకు పైగా సాగిన చర్చలలో రాష్ట్రంలో ఉన్న అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందన్నారు.

శివనామస్మరణతో మారుమ్రోగిన పంచదార్ల శివాలయం

విశాలాంధ్ర - రాంబిల్లి: మండలంలో పలు గ్రామాలలో కార్తీకమాసం మూడో సోమ వారం కావడంతో శివాలయాలు కళకళలాడాయి. పంచదార్ల గ్రామంలో చారిత్రక విశిష్టత కలిగిన శ్రీ ఉమాధర్మ లింగేశ్వరాలయం అతి ప్రాచీన శైవక్షేత్రం కావడం, ఈ ఆలయ ప్రదేశంలో ఎల్లవేళలా భూగర్భం నుంచి పైకి వచ్చే ఐదు నీటి ధారలలో(పంచధారలు) భక్తులు తెల్లవారుజామునుండే స్నానమాచరించి శివాలయంలో శివలింగాన్ని దర్శనం చేసుకున్నారు.

భారీ అన్న సమరాధన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండల కేంద్రంలోని అడవిలో ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా రావిచెట్టు జంక్షన్ యూత్ భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి 2000 మంది భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అధికంగా అయ్యప్ప స్వామి భక్తులు, శివ భవాని మాలాధారణ భక్తులు హాజరయ్యారు. అలాగే ఎం.కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద కూడా భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ఆక్రమణలు చేస్తే చర్యలు

విశాలాంధ్ర - హుకుంపేట: మండల కేంద్రంలోని గిరిజనేతరాలు కొండమ్మ అక్రమంగా నిర్మాణం చేయటంతో సబ్ కలెక్టర్ ఆదేశాలు మేరకు స్థానిక తహశీల్దార్ జర్యాలక్ష్మి తమ సిబ్బందితో సోమవారం సీజ్ చేసామని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతలోని గిరిజన నేతరులు అక్రమంగా గృహాలు, దుఖాణాలు నిర్మాణాలు చేయుట చట్టరీత్యా నేరమని తెలిపారు. సబ్ కలెక్టర్ ప్రభుత్వం నుంచి అనుమాతులు వచ్చే వరకు దుకాణం తీయడం సరికాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రంగారావు కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ, దసపల్లా భూముల కబ్జాపై మంత్రి అమర్నాథ్ మాట్లాడాలి

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రుషికొండను ఏపీ టూరిజం పేరుతో కబ్జా చేస్తున్నారని, దసపల్లా భూములపై సిబిఐ విచారణ జరపాలన్న మంత్రి గుడివాడ అమర్నాథ్ ఎందుకు నోరు విప్పడం లేదని, వీటిపై మంత్రి అమర్నాథ్ మాట్లాడాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం హెూటల్ మేఘాలయలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విపక్షాల నాయకులు రుషికొండ వద్దకు వెళ్తే అరెస్ట్ చేస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని నిలదీశారు. రుషికొండపై ఏపి టూరిజం రీ డెవలప్మెంట్ ప్లాన్ పేరుతో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్ నుంచి 9.88 ఎకరాలే తీసుకున్నారని, కానీ ఏపి టూరిజం హైకోర్టులో ప్రభుత్వానికి 3.8 ఎకరాలు అదనంగా తవ్వామని అఫిడవిట్ ధాఖలు చేశారని ఆయన వెల్లడించారు. అయితే రుషికొండలో కొత్త భవనాల నిర్మాణానికి 2.78 ఎకరాల్లోనే నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతులు తెచ్చుకుని, అనుమతులకు మించి కొండను తవ్వుతున్నారన్నదే తమ అభ్యంతరమని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ సంపద రుషికొండ కోసం న్యాయపోరాటం చేస్తున్నామని వివరణ ఇచ్చారు. పవన్ కల్యాణ్‌తో ఫోటో దిగేందుకు అమర్ ఏళ్ల తరబడి ఎదురుచూడలేదా అని ప్రశ్నించారు. జగనన్న ఇళ్లలో బినామీలను పెట్టి పేదలను మోసం చేస్తున్నారని, ఇందులో రూ.17 వేల కోట్ల కుంభకోణం జరుగుతోందన్నారు. పవన్ కళ్యాణ్ ను విమర్శించే నైతిక హక్కు వైసిపి నేతలకు లేదని, రానున్న రోజుల్లో వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనసేన రీజనల్ కోఆర్డినేటర్ ఎం నాగలక్ష్మి, జనసేన నాయకులు శ్రీనివాస్ పట్నాయక్, దుర్గా, రూప, కళ, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - మాకవరపాలెం: ఆధునిక భారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ అని మాకవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు బిఎ.రామయ్య అన్నారు. స్థానిక గ్రంథాలయంలో బాలల దినోత్సవం, గ్రంథాలయల వారోత్సవాలలో ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం కార్యదర్శి ఎ.శేషగిరిరావు, గ్రామ పెద్దలు ఆర్.నారా యణమూర్తి, బివి.సత్యనారాయణ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కాపురం: గ్రంథాలయాలకు వచ్చి నిరంతరం గ్రంథాలను చద వడం ద్వారా వ్యక్తిత్వం వికసిస్తుందని జ్ఞానం పెరుగుతుందని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అన్నారు. సోమవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల లైబ్రరీ లో గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభిస్తూ- మంచి పుస్తకం మంచి స్నేహితుడు వంటిదని అన్నారు. గ్రంథాలయాధికారి శ్రీమతి జి.శిరీష అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 20. వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించబడుతుంది. దీనిలో భాగంగా గ్రంథాలయ పితామహుడు ఎస్సార్ రంగనాథ్ ని స్మరించుకొని వారి చిత్ర పటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనం చిట్టి అబ్బాయి, గ్రంథాలయ శాఖ విభాగ్యపతి శ్రీ అనిత, పి మణికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఆర్ రసూల్ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ వి రమేష్ బాబు, ఏ మురళీధర్ రావు, పి సాంబమూర్తి, పి కోటేశ్వరరావు, అశ్విని రెడ్డి, పి రమేష్ కుమార్ ఇతర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రామోంటనా కుకింగ్ స్టవ్‌లతో ఎంతో మేలు

విశాలాంధ్ర -పాడేరు: ట్రామోంటనా కంపెనీ తయారు చేసిన పొగరాని పోయిలు ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పాడేరు ఎంపిపి ఎస్. రత్న కుమారి గృహిణులను ఉద్దేశించి ప్రసంగించారు. సోమవారం క్రాప్ జోన్ సంస్థ ఎం డి సాయి బాబా ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మార్కెట్ యాడ్ ఆవరణలో పొగరాని పోయిల ఆవశ్యకత పై మహిళకు అవగాహన కల్పించేందుకు సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, క్రాప్ జోన్ ఎం డి సాయి బాబా, మాజీ ఎంపీపీ రమణ మూర్తి, క్రాప్ జోన్ సిబ్బంది రమేష్,లక్ష్మణ్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సమయపాలన లేని సచివాలయ సిబ్బంది

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి గణేష్ నగర్ సచివాలయంలో సిబ్బంది మధ్యాహ్నం 12 అయినా కానరాలేదు. ఎంతసేపు ఎదురుచూసినా సిబ్బంది ఎవరూ రాకపోవడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయంలో సిబ్బంది ప్రజలకు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా జడ్జి గోపికి పోలీసు అధికారులు అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఇటీవల విశాఖ జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టిన జి. గోపి ని నగర పోలీసు కమిషనర్ సి.హెచ్ శ్రీకాంత్, నగర డి.సి.పి-1(లా అండ్ ఆర్డర్) సుమిత్ సునీల్ గరుడ్ ల తో కలిసి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి నట్లు నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది. విశాఖ జిల్లా, నగరంలో శాంతిభద్రతలు పై ఈ సందర్భంగా జిల్లా జడ్జి కి పోలీస్ అధికారులు వివరించినట్లు తెలిసింది..

ఘనంగా బాలల దినోత్సవం

విశాలాంధ్ర - కొమ్మాది: మధురవాడ బక్కన్నపాలెం రోడ్‌లో ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సూపరెండెంట్ గుప్తా పాల్గొ న్నారు. బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వ హించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సందీప్, ఉత్తరాంధ్ర జిల్లాల శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సురేష్, పాఠశాలల రీజనల్ ఇన్చార్జ్ మహమ్మద్ అలీ, ప్రైమరీ జోనల్ ఇన్చార్జ్ శైలజ, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు, ప్రైమరీ ఇన్చార్జ్ ఘదుర్గ, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ దీప్తి, డీన్ ఢిల్లేశ్వరరావు, సి-బ్యాచ్ ఇన్చార్జ్ జగదీష్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ: జీవీఎంసీ జోన్ 2 పరిధి 5, 7 వార్డులలో ప్రభుత్వం, ప్రభుత్వేతర పాఠశాలల్లో



సోమవారం నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో 7వ వార్డు గణేష్ నగర్ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రభాకర్, పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాష్, సిహెచ్.జగన్మోహ నరావు, బి.పాపారావు, వంటాకుల శ్రీనివాసరావు, డాక్టర్ రమేష్, తోట ఆశా సరూప్, పి.అప్పన్న, మామిడి వరలక్ష్మి, నోకవరపు బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: స్థానిక కేజీబీవీ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ గొప్పతనాన్ని, పిల్లలపై ఆయనకు ఉన్నటువంటి ప్రేమను



తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కు క్రీడల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాధికారిణి చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలం కొట్నాపల్లి ఎంపీయూపీ పాఠశాలలో పౌర సంస్థ అధ్వర్యంలో ప్రధాన ఉపాధ్యా యులు ఉమామహేశ్వరరావు అధ్యక్షతన

ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ప్రధాన ఉపాధ్యా యులు కేక్ కట్ చేసి బాల బాలికలకు తినిపించి బాలికల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పౌర స్వచ్ఛంద సంస్థ సేవ సంస్థ జిల్లా సమన్వయకర్త టి.కృష్ణారావు, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: పారిశ్రామిక వార్డుల్లో వివిధ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు ఆయా

పాఠశాలల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక 59వ వార్డు పరిధిలోని గల ప్రతిభ పాఠశాల ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా చాచా నెహ్రూ వేష ధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తోనంగి వెంకటరమణ, పాఠశాల ఉపాధ్యాయులతోపాటు చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: నర్సీపట్నం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నంగిన రమణ ఆధ్వర్యంలో సోమవారం స్వర్గీయ

జవహర్‌లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిసిసి సభ్యులు మీసాల సుబ్బన్న నెహ్రూ ఈ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దా, కర్రి తాతబ్బాయి, జనపరెడ్డి సూరిబాబు, చుక్కల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: పిసిసి సభ్యుడు జగతా శ్రీనివాస్ ఆదేశాల మేరకు మాజీ ప్రధాని స్వర్గీయ జవహర్

లాల్ నెహ్రూ జయంతి స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పోలవరపు అప్పలరాజు, కర్రి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలం లో చిలకల గెడ్డ

పంచాయితి వెంకయ్యపాలెం ఎంపీపీ స్కూల్ లో బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ జీ. నరేంద్ర ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బాలలహక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ మాట్లాడుతూ, బాలల హక్కులపై అవగాహన కల్పించారు అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు పెన్సిల్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు మెంబర్ దేముడమ్మ, సర్పంచ్ మజ్జి. అప్పారావు. ఉప సర్పంచ్ కొండమ్మ, ఉపాధ్యాయురాలు పద్మకుమారి గ్రామ పెద్దలు గ్రామస్థులు విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు,

వి.మాడుగుల: ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా మండల కేంద్రంలోని దొరల వీధిలో జవహర్ లాల్ నెహ్రూ 135వ జయంతి వేడుకలు పెయ్యల ఎర్రయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా నెహ్రూ విగ్రహానికి ఎంపీపీ పెదబాబు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాధు శ్రీనువాసరావు, వైకాపా పట్టణ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీను, పిఏసిఎస్ పర్సన్ ఇంఛార్జ్ పెరుమాళ్ళ వెంకటరావు, వార్డు మెంబర్లు జవ్వాది వరహాలు, వేమన గణేష్, ఎడ్ల హేమంత్ కుమార్, సయ్యపు రెడ్డి సత్తిబాబు, శీలామంతుల వాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - సీలేరు: గూడెంకొత్తవీధి మండలం దారకొండలో ఈ నెల 15న రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జికెవీధి ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారికి నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో విశాఖపట్నం నుండి డాక్టర్ ఎల్‌వి ప్రసాద్, బృందంతో బాటు అన్ని రకాల వ్యాధులకు వైద్యాన్ని అందించ దానికి గాను దారకొండలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గుమ్మిరేవులు, దారకొండ, సప్పర్ల దుప్పులవాడ, సీలేరు గ్రామ పంచాయితీ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు దారకొండ లోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల (బాలురు) లో మెగా వైద్య శిబిరం వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.